సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం | 29 | డిసెంబర్ | 2023



పేద విద్యార్థుల చదువుకు నిశ్చింత

ప్రభుత్వం పేదల చదువులకు భరోసా నిచ్చింది. నిరుపేద విద్యార్థులు ఫీజుల చెల్లింపులకు ఇబ్బందులు పడకుండా 'జగనన్న విద్యా దీవెన' పథకాన్ని ప్రవేశ పెట్టింది.

-8లో



ఎన్నికలకు సన్నద్ధం కావాలి

రానున్న ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పోలీస్ అధికారులను ఆదేశించారు.

-8లో

గరిష్టం/కనిష్టం
30.3/17.1

వాతావరణం

జిల్లాలో గురువారం 17.1 – 30.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

హుండీ ఆదాయం రూ.21 లక్షలు

కాశినాయన: మండలంలోని జ్యోతిక్షేత్రంలో కాశినాయన ఆరాధన మహోత్సవాలు రెండు రోజుల పాటు జరిగాయి. భక్తులు చందా రూపంలో హుండీలో వేసిన నగదును గురువారం లెక్కించారు. రూ.21.35 లక్షలు వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ నగదును అన్నదానం, ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

గణితంలో బంగారుపతకం



పీజీ డిగ్రీ అందుకుంటున్న హమీదా పర్వీన్

కడప ఎడ్యుకేషన్: కడప నగరం రూకవారిపల్లెకు చెందిన షేక్ హమీదా పర్వీన్‌కు డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ మ్యాథ్స్‌లో బంగారు పతకాన్ని లభించింది. గురువారం యూనివర్సిటీ 25వ స్నాతకోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో వీసీ నుంచి పతకంతో పాటు స్నాతకోత్సవ పీజీ డిగ్రీ పట్టాను ఆమె అందుకున్నారు.

క్రీడలను పరిశీలించిన జేసీ



ఎర్రగుంట్ల: అధికారులతో మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఆడుదాం- ఆంధ్ర క్రీడా పోటీలను జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి జగన్నాథ్, తాహసీల్దార్ ఎ నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు: 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా ముద్దనూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాల మైదానంలో జరుగుతున్న క్రీడలను జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మండల వ్యాప్తంగా జరుగుతున్న క్రీడల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా క్రీడలను నిర్వహించాలని, ఈ సందర్భంగా క్రీడాకారులను జేసీ పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామునాయక్, తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఈవోపీఆర్డీ వీరభద్రుడు, మండల విద్యాశాఖాధికారులు సుబ్బారావు, నాగేశ్వరరావు నాయక్, ఫిజికల్ డైరెక్టర్ మాధవరెడ్డిలు పాల్గొన్నారు.

సాధికార గర్జన



బస్సు యాత్రలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం తదితరులు



రాయచోటిలో జరిగిన సామాజిక సాధికార యాత్రకు భారీగా హాజరైన ప్రజలు

- జనంతో పోటెత్తిన రాయచోటి
- విజయవంతమైన సామాజిక సాధికార యాత్ర
- ప్రభుత్వం చేసిన మేలును వివరించిన ప్రజాప్రతినిధులు

రాయచోటి: అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో జరిగిన సామాజిక సాధికార యాత్రకు అనూహ్య స్పందన లభించింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు విచ్చేసిన సామాజిక సాధికార యాత్రను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా జెండా ఊపి ప్రారంభించారు. వేడిని సైతం లెక్కచేయకుండా వేలాదిగా హాజరైన ప్రజలు, నాయకుల ప్రసంగాలను ఓపిగ్గా విన్నారు. ఈ యాత్రలో శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానమ్, ఎంపీ నందిగం సురేష్, మాజీమంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేష్‌యాదవ్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బడుగు, బలహీనుల పక్షాన నిలబడిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ.

వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలు

రాయచోటిలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతమైంది. నియోజకవర్గ పరిధిలోని 6 మండలాల్లోని గ్రామాల ప్రజలు ఒక్కటి కావడంతో పట్టణంలోని చిత్తూరు-కడప జాతీయ రహదారి జన ఉప్పెనై పొంగింది. జెండాలను రెపరెపలాడిస్తూ జనం కదం తొక్కారు. రాయచోటి పరిధి రింగురోడ్డులోని అభి కళ్యాణమండపం నుంచి మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన బస్సుయాత్రకు అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు.

సామాజిక న్యాయాన్ని, ధర్మాన్ని పాటించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలకు ఒరిగిన అభివృద్ధిని వారు వివరించారు. అలాగే రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల ప్రజలకు జరిగిన సామాజిక న్యాయాన్ని జగనన్న పాలనలో అందుతున్న వైనాన్ని తెలియపరిచారు. తమ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చిన ప్రాధాన్యత రాష్ట్ర చరిత్రలోనే కాకుండా దేశచరిత్రలోనే లేదన్నారు. సంక్షేమ కార్యక్రమాలలో పెత్తందారీ పోకడలు ఉన్న పార్టీలు అడుగడుగునా అడ్డుపడుతున్నా ఎక్కడా వెనుకడుగు వేయలేదన్నారు.

సంక్షేమ సారథి జగనన్న : ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అందిస్తూ పేదల గుండెల్లో సంక్షేమ సారథిగా...ఎక్కడ చూసినా అభివృద్ధి పనులతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటికి ఎవరూ ఊహించని స్థాయిలో ఒక పెద్ద పరిశ్రమను తీసుకొస్తానని అన్నారు. 3000–3500 మందికి ఉపాధి కల్పించేలా పరిశ్రమ తీసుకొచ్చి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడానికి శాయశక్తులా కృషి చేస్తానని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేదలకు మంచి జరగాలని అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారన్నారు. సామాజిక సాధికార యాత్ర లక్ష్యం ఈ నాలుగున్నరేళ్లలో బడుగు,బలహీన,మైనార్టీ వర్గాలకు జగనన్న వల్ల జరిగిన మేలును తలచుకోవడమేనని తెలిపారు. చంద్రబాబు జిల్లా కేంద్రాన్ని మారుస్తానని చెబుతున్నారని, తన ప్రాణం ఉన్నంతవరకు జిల్లా కేంద్రాన్ని మార్పు చేయనీయనని తెలిపారు. అన్నమయ్య జిల్లా అంటేనే రాయచోటి అని గుర్తు వచ్చేలా చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాయచోటిలో స్టేడియం, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు, ఆర్‌అండ్‌ అతిథి గృహం, డీఎస్పీ కార్యాలయం, నూతన పోలీసుస్టేషన్‌తోపాటు అన్ని రంగాల్లోనూ రాయచోటి అభివృద్ధిలో దూసుకుపోతున్నదని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాయచోటి నియోజకర్గానికే ఈ నాలుగున్నరేళ్లలో పథకాల కోసం, అభివృద్ధి పనుల కోసం రూ.1289 కోట్ల ప్రయోజనం కల్పించారన్నారు. ఒక్క రాయచోటి నియోజకవర్గానికే డీబీటీ ద్వారా రూ.934 కోట్లు, నాన్ డీబీడీ కింద రూ.355 కోట్లు ఖర్చు చేశారన్నారు.

వైఎస్ జగన్‌తోనే సామాజిక న్యాయం

ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, చిత్రంలో నందిగం సురేష్, ఆకేపాటి, రమేష్‌యాదవ్, జకియాఖానం

రాయచోటి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఆర్థికంగా, సామాజికంగా, విద్య, రాజకీయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర కార్యక్రమానికి పలువురు నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానమ్, ఎంపీ నందిగం సురేష్ వివిధ వర్గాల నాయకులతో కలిసి మాట్లాడారు. సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో వివిధ వర్గాల వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2.5 లక్షల కోట్ల రూపాయల నిధులను నేరుగా లబ్ధిదారులకే జమ చేశారన్నారు. రాష్ట్రంలో జగన్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సాధికార యాత్రకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోందన్నారు. యాత్రలు విజయవంతం అవుతుండటంతో ప్రతిపక్షాలకు భయం పట్టుకుందన్నారు. చంద్రబాబు నాయీబ్రాహ్మణుల తోక కత్తిరిస్తామనడం, ఎస్టీలలో ఎవరు పుట్టాలనుకుంటారని, బీసీలు ఉన్నత పదవులకు పనికిరారని చెప్పడం దుర్మార్గమన్నారు. హోంమంత్రి విద్యాశాఖా మంత్రులుగా ఎస్సీలు, ఉపముఖ్యమంత్రి గా మైనార్టీలకు ఇవ్వడం దేశంలో ఎవరూ చేయలేని ఒక చరిత్రను సీఎం జగన్ సృష్టించారన్నారు.

- సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం మహిళలకు అన్ని వర్గాల వారికి న్యాయం జరిగిందని మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం అన్నారు. సాధారణ మహిళనైన తనకు శాసనమండలి సభ్యురాలుగా చేయడంతో పాటు మండలి డిప్యూటీ వైస్ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వడం మామూలు విషయం కాదన్నారు.సీఎం వైఎస్ జగన్ మైనార్టీల పక్షపాతి అని అన్నారు.
- ప్రజల సంక్షేమం కోసం కుల, మత, బేధాలు లేకుండా పారదర్శక పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎంపీ నందిగం సురేష్ అభిప్రాయపడ్డారు. చేనేత, వాహనమిత్రలు వివిధ కులవృత్తుల వారికి సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నారని తెలిపారు.పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకు జగనన్న పాలనలో న్యాయం జరుగుతుందన్నారు. 2024లో జరిగే ఎన్నికలలో ఎమ్మెల్యేగా శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీగా మిథున్‌రెడ్డిలను 50 వేల మెజార్టీతో గెలిపించుకొని మళ్లీ జగనన్నను సీఎంగా చేసుకోవాలన్నారు.
- బీసీలంటే బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదని బ్యాక్ బోన్ అని జగనన్న నిరూపించారని ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ అన్నారు. అన్ని నియోజకవర్గాల్లో సీఎం జగన్ చేసిన అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమాన్ని చూసి సామాజిక సాధికారిక యాత్రకు ఎస్సీ, ఎస్టీ, మైనారీ, బీసీలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా, అందరూ ఏకమైనా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఓడించలేరన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా పార్టీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పండుగలా సంక్షేమ ఫలాల పంపిణీ: కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను లబ్ధి దారులకు పండుగ వాతావరణంలో పంపిణీ చేసేందుకు అధికారులు శ్రద్ధ చూపాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడారు. జనవరి 1 నుంచి పెంచిన పెన్షన్ కానుక అందజేయాలన్నారు. వచ్చేనెల 19న విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం ఆవిష్కరిస్తారని, అదే ఫొటో ఫ్రేమ్‌లను గ్రామసచివాలయాల్లో ప్రతిష్టించి ఉత్సవాలు జరపాలన్నారు. జనవరి 23న చివరి దఫా వైఎస్సార్ ఆసరా సొమ్ము విడుదల కార్యక్రమంపై ప్రచారం చేపట్టాలన్నారు.ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, పరిశ్రమల అభివృద్ధి సలహాదారు రాజోలి వీరారెడ్డి, ఉద్యాన సలహాదారు శివప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పాల్గొన్నారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, చిత్రంలో జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, డీఈఓ రాఘవరెడ్డి తదితరులు

- విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి
- రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జెడ్పీ చైర్మెన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: మనదేశ శాస్త్రవేత్తలు సీవీరామన్, ఏపీజే అబ్దుల్‌కలాం లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని, దేశానికి సేవచేయాలని, విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. గురువారం కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ జరిగింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజం, టీచర్స్ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా వారు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి అధ్యక్షతన, జిల్లా సైన్స్ అధికారి బి. మహేశ్వరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌ను కడపలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. విద్యకు రూ. 40 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం విద్యకు ఇంత పెద్ద మొత్తంలో బడ్జెట్‌ను కేటాయించలేదన్నారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి ఆమరనాథరెడ్డి మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రతి పేదవాడు ఉన్నత విద్యను అభ్యసించే విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టారన్నారు. తండ్రిని ఆదర్శంగా తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడు కూడా ఉన్నత స్థితికి ఎదిగేందుకు పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని తెలిపారు.పేదల పిల్లలు కూడా చదువుకోవాలనే లక్ష్యంతో అమ్మ ఒడి పథకాన్ని తెచ్చారన్నారు. అలాగే విదేశీ విద్యాదీవెనతో చాలా మంది నేడు ఇతర దేశాలకు వెళ్లి చదువుకుంటున్నారని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులను వారు పరిశీలించారు. వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో జ్యూరీ సభ్యులుగా మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ పత్తి కృష్ణారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓలు రాజగోపాల్‌రెడ్డి, కృష్ణయ్య, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి, మాజీ సైన్స్ అధికారులు రవికిరణ్, నిత్యానందరెడ్డి, రెహమాన్, కార్పొరేటర్ షఫీ, నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, అహమ్మద్, కడప ఎంఈఓ పాలెం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలు అదరహో

కడప ఎడ్యుకేషన్: చిన్నారులు తమ మేధస్సుకు పదును పెట్టి వినూత్న ఆలోచనలతో సాంకేతికను అందిపుచ్చుకున్నారు. చిట్టి బుర్రలో మెదిలిన చక్కటి ఆలోచనతో అద్భుత ఆవిష్కరణలను ప్రదర్శించారు. శాస్త్ర సాంకేతికత, పర్యావరణ, సామాజిక రంగాల నుంచి వైవిధ్యమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ ఆకట్టుకుంది. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. 234 ప్రాజెక్టులు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.

ప్రాజెక్టు పేరు: స్టాప్ సూసైడ్



స్టాప్ సూసైడ్ ప్రాజెక్టుతో విద్యార్థులు, ఉపాధ్యాయుడు

గైడ్ టీచర్ : రామకృష్ణ
విద్యార్థులు: పూజశ్రీ, శాంతిసౌమ్య 9వ తరగతి
స్కూల్‌పేరు: జెడ్పీ హైస్కూల్, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా
ప్రధానాంశం: నేడు చాలా మంది చిన్న విషయాలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇళ్లలో ఫ్యాన్లకు ఉరివేసుకోవడం లేదంటే భవంతులపై నుంచి దూకడం వంటివి చేస్తున్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు శోకం మిగుల్చుతున్నారు. వీటిని నివారణకు సంబంధించిన ప్రదర్శనను చిన్నారులు చూపారు. ఇంట్లో ఏర్పాటు చేసే ఫ్యాన్‌కు స్ప్రింగ్, బాల్‌ను ఏర్పాటు చేసుకుంటారు. దానికి మనిషి ఉరి వేసుకోగానే ఆటోమేటిక్‌గా కిందకు వచ్చి నేలకానుతుంది. దీంతో ఉరి వేసుకునేందుకు వీలుకాదు. అలాగే ఇంటిని నిర్మించుకునే ముందు గ్రౌండ్‌ఫ్లోర్ చుట్టూ సెన్సార్, భవనానికి చుట్టూ నెట్‌ను కూడా ఏర్పాటు చేసుకుంటారు. ఎవరైనా ఆ భవనం మీదకు వెళ్లి దూకేందుకు ప్రయత్నం చేయగానే కింది భాగంలో ఏర్పాటు చేసిన సెన్సార్ గ్రహించి వెంటనే నెట్ ఓపెన్ అవుతుంది. దీంతో దూకిన వాళ్లు ఆ వలలో పడి ప్రాణాలను కాపాడుకునేందుకు వీలవుతుంది.

స్మార్ట్ మల్టీపర్పస్ వీల్‌చైర్



స్మార్ట్ మల్టీపర్పస్ వీల్ చైర్‌తో ఉపాధ్యాయుడు, విద్యార్థులు

గైడ్ టీచర్ : టైటస్
విద్యార్థులు: మహలక్ష్మి, నాగచైతన్య, 10వ తరగతి
స్కూల్‌పేరు: సీకేజేఆర్‌సీ ఎయిడెడ్ స్కూల్, మంగళగిరి
ప్రధానాంశం: సోలార్ ప్యానల్ ద్వారా తయారు చేసిన ఈ స్మార్ట్ మల్టీపర్పస్ వీల్ చైర్‌తో వికలాంగులు, గర్భిణులు, వృద్ధులకు ఎంతో మేలు. దీనికి ఏర్పాటు చేసిన సోలార్ ఎనర్జిటిక్ మోటార్ ద్వారా ముందుకు వెనక్కు వెళుతుంది. దీనికి సంబంధించి కంట్రోలర్ కూడా వీరి చేతిలోనే ఉంటుంది. అలాగే చైర్‌లో వీరు అనుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన స్మార్ట్ పిల్లో ద్వారా పొరపాటున ఏదైనా అయ్యి (అపస్మారక స్థితి) అటు ఇటు వాలిపోతే పిల్లోలో ఉండే అలారమ్ మోగుతుంది. దీంతో సంబంధిత వ్యక్తులు స్పందించి ప్రమాదం నుంచి వారిని కాపాడేందుకు వీలుంటుంది.

సోలార్ సెన్సార్డ్ క్యాటిల్ షెడ్



ప్రాజెక్టుతో గైడ్ టీచర్, విద్యార్థి

గైడ్ టీచర్: వీఎస్‌ఏ లక్ష్మి
విద్యార్థిపేరు: చింత అనీలా సుధ, ప్రభుత్వ బాలికల హైస్కూల్, అమలాపురరం, అంబేడ్కర్ కొనసీమజిల్లా
ప్రధానాంశం: అధిక మొత్తంలో పశువుల పెంపకం చేసే వారికి ఈ సోలార్ సెన్సార్డ్ క్యాటిల్ షెడ్ ఉపయోగకరంగా ఉంటుంది.ఇది సోలార్ ఎనర్జీ ఎన్సార్డ్ ద్వారా పనిచేసే మోటార్, కన్వీనర్ బెల్ట్ ద్వారా పశువులకు ఆహారంతోపాటు నీరు అందించొచ్చు. ఫలితంగా పశువుల పెంపకంలో శ్రమ దగ్గుతుంది. ఈ సోలార్ సెన్సార్డ్ ద్వారా తక్కువ ఆహారం తీసుకుంటున్న పశువులను గుర్తించి వాటి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవచ్చు.

వ్యర్థాలతోనే శుభ్రం



ప్రాజెక్టులతో విద్యార్థి, గైడ్ టీచర్

గైడ్ టీచర్: రామలక్ష్మి
విద్యార్థిపేరు: లావణ్య, 9వ తరగతి, శ్రీగౌతమ్ మున్సిపల్ హైస్కూల్, మండపేట, కొనసీమజిల్లా
ప్రధానాంశం: వ్యర్థాలను ఉపయోగించి తయారు చేసిన లిక్విడ్ ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపనుంది. దీని ద్వారా గ్రీన్ హౌస్ ఎఫెక్ట్‌ను తగ్గించడానికి, అలాగే వాతావరణ కాలుష్యానికి పరిష్కారం దొరుకుతుంది. పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడుతుంది.

రైళ్లలో అగ్నిప్రమాదాల నివారణ



ప్రాజెక్టుతో విద్యార్థులు

గైడ్ టీచర్: పాపారావు
విద్యార్థులు: దిలీప్‌కుమార్, ఓం మహాపాత్రో, జెడ్పీ హైస్కూల్, కొలిగం, శ్రీకాకుళం జిల్లా
ప్రధానాంశం: ఇటీవల నిత్యం ఏదో ఒకచోట రైళ్లలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో ముఖ్యంగా అగ్నిప్రమాదాల వల్ల పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. దీని నివారణకు రైలులోని ప్రతి బోగీలో సాధారణ ఉష్ణోగ్రతలను గ్రహించేలా సెన్సార్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ సెన్సార్ రైలును నడిపే డ్రైవర్‌కు అనుసంధానంగా ఉంటుంది. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదాలు జరిగినపుడు బోగీలో ఏర్పాటు చేసిన సెన్సార్ వేడిని గుర్తించి వెంటనే సంబంధిత సమాచారాన్ని డ్రైవర్‌కు చేరవేస్తుంది. దీంతో డ్రైవర్ అప్రమత్తమై రైలును ఆపి వెంటనే ప్రయాణికులను ప్రమాదం బారి నుంచి కాపాడేందుకు అవకాశం ఉంటుంది

క్లుప్తంగా

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చికిత్స పొందుతూ ఈనెల 27న గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈనెల 15న ప్రమాదానికి గురై గుర్తు తెలియని వృద్ధుడు గాయాలతో ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందడంతో మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో ఉంచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమకు తెలియజేయాలని ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు కోరారు.

'ఆడుదాం ఆంధ్ర'కు చక్కటి స్పందన



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్డీఓ జగన్నాథరెడ్డి

కడప స్పోర్ట్స్ : క్రీడాకారుల్లోని ప్రతిభను వెలుగులోకి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమానికి క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభిస్తోంది. ఈనెల 26న ప్రారంభమైన ఈ మెగా క్రీడాటోర్నమెంట్‌లో నిర్వహిస్తున్న గ్రామ/వార్డు సచివాలయస్థాయి పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి గురువారం క్రీడాపోటీలను ప్రారంభించారు. రాజంపేట నియోజకవర్గ పరిధిలోని ఒంటిమిట్టలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర' పోటీలను రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. జిల్లా వ్యాప్తంగా 645 సచివాలయల పరిధిలోను, అన్నమయ్య జిల్లాలో 501 సచివాలయ పరిధిలో ఐదు (క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్) క్రీడాంశాల్లో పోటీలు కొనసాగుతుండగా, క్రీడాకారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

పేద విద్యార్థుల చదువుకు నిశ్చింత.!

ప్రభుత్వం పేదల చదువులకు భరోసా నిచ్చింది. నిరుపేద విద్యార్థులు ఫీజుల చెల్లింపులకు ఇబ్బందులు పడకుండా 'జగనన్న విద్యా దీవెన' పథకాన్ని ప్రవేశ పెట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ ఫలితంగా విద్యా రంగం వికసిస్తోందని పేదలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

- జిల్లా వ్యాప్తంగా 250 కాలేజీలు
- మొత్తం 38,531 మంది విద్యార్థులు
- ఫీజులకు రూ 29.33 కోట్లకు పైగా చెల్లింపులు
- నేడు జగనన్న విద్యా దీవెన 4వ విడత నిధులు విడుదల



జిల్లాలో జగనన్న విద్యా దీవెన మూడవ విడత నిధుల చెల్లింపుల వివరాలు

వర్గం	విద్యార్థులు	నిధుల విడుదల (రూ)
ఎస్సీ	9,071	6,67,77,389
ఎస్టీ	646	44,81,176
బీసీ	13,279	9,50,46,527
ఈబీసీ	6,562	6,33,33,902
కాపు	4,656	3,62,79,331
ముస్లిం	4,212	2,66,33,445
క్రిస్టియన్	105	8,46,246
మొత్తం	38,531	29,33,98,016

కడప రూరల్ : పేదల విద్యా సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అందులో భాగంగా జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను ప్రవేశ పెట్టారు. ఫలితంగా పేద విద్యార్థులు నిశ్చింతగా చదువును సాగిస్తున్నారు.

నేడు 4వ విడత నిధులు మంజూరు

జగనన్న విద్యా దీవెన కింద ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులను అభ్యసించే పేద విద్యార్థులకు పూర్తి ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ నిధులను మూడు నెలలకు ఒక సారి చొప్పున ఒక ఏడాదిలో నాలుగు విడతలుగా ఠంఛన్‌గా మంజూరు చేస్తోంది. కాగా 2022-2023 విద్యా సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, ముస్లిం, క్రిస్టియన్ వర్గాలకు చెందిన మొత్తం 38,531 మంది విద్యార్థులు 250 కాలేజీల్లో చదువుకుంటున్నారు. వీరికి 4వ విడత కింద ఎస్సీ విద్యార్థులకు మాత్రం సదరు విద్యార్థి బ్యాంకు ఖాతాలోనే నగదు జమ అవుతుంది. మిగతా వర్గాల వారికి సంబంధించి విద్యార్థుల తల్లుల ఖాతాలకు నగదు జమ కానుంది. ఆ మేరకు ప్రభుత్వం జిల్లాలోని అర్హులైన విద్యార్థులకు మొత్తం రూ.29,33,98,016 జమ చేయనుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం భీమవరంలో నిర్వహించే కార్యక్రమంలో ఈ నిధులను విడుదల చేయనున్నారు.

గతంలో చదువుల పథకాలకు చెదలు

గత తెలుగుదేశం పార్టీ పాలనలో ఫీజుల పథకం గాలిలో దీపంలా మారింది. నాటి ప్రభుత్వం సక్రమంగా కాలేజీలకు ఫీజులను చెల్లించేది కాదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి, మనోవేదనకు గురయ్యేవారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో ఫీజుల కష్టాలు వెంటాడేవి. కాలేజీ యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేగాని హాల్‌టికెట్లు ఇచ్చేవారు కాదు. ఇలా పేద విద్యార్థులు మానసిక క్షోభకు గురయ్యేవారు. నాడు చదువుల పథకాలకు చెదలు పట్టిందని చెప్పవచ్చు.

ఇప్పుడు చింతలేని చదువులు

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక విద్యా రంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేశారు. దేశం యావత్తు అబ్బుర పడేలా విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. ఫలితంగా విద్యార్థులు ఎలాంటి చీకూచింతా లేకుండా చదువుకుంటున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి



ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన కింద 4వ విడత నిధులను విడుదల చేస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ డబ్బును ఒక వారంలోపు కాలేజీలో చెల్లించాలి. అదే సందర్భంగా తమ బిడ్డ చదువులు..కాలేజీలో ఉండే సౌకర్యాలను తదితర విషయాలను ఆరా తీయాలి. జవాబుదారితనం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాలేజీ ఫీజులను విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులు విద్యా వేత్తలుగా ఎదగాలి.

– సరస్వతి, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ

కడప నగరంలో అగ్ని ప్రమాదాలు

కడప అర్బన్ : కడప నగరంలోని అశోక్‌నగర్‌లో బుధవారం అర్ధరాత్రి తోటంశెట్టి సుబ్బరాయుడు, గౌరిల ఇంటిలో విద్యుత్ స్విచ్ బోర్డ్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కడపలోని అమ్మవారిశాలలో అటెండర్‌గా పనిచేస్తూ సుబ్బరాయుడు జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య ఇంటి వద్దనే కిరాణా షాపు నిర్వహిస్తోంది. అర్ధరాత్రి స్విచ్ బోర్డ్‌లో నుంచి మంటలు చెలరేగి ప్రమాదం చోటుచేసుకుంది. ఇంటిలోని వారు వెంటనే కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. స్థానికులు అగ్నిమాపక శాఖ వారికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనలో దాదాపు రూ.2.5 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు ఫైర్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు.



అగ్నిప్రమాదంలో కాలి బూడిదైన వస్తుసామగ్రి

■ కడప రాయల్ హాల్‌లో ఉన్న ఖాళీ ప్రదేశంలో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయడంతో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పాత సామగ్రి మంటల్లో కాలి బూడిదైపోయింది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

సామాజిక సేవలో ఆదర్శంగా నిలుస్తాం



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు నటేష్ కుమార్ కొలుసు

కమలాపురం : సామాజిక సేవను తమ బాధ్యతగా భావిస్తామని, సామాజిక సేవ చేయడంలో అన్ని పరిశ్రమలకు ఆదర్శంగా నిలుస్తామని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సాయి రమేష్, సీఎస్ఆర్ హెచ్ఓడీ భార్గవ్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఆర్‌సీఎం ఆసుపత్రి ఆవరణంలో హైదరాబాద్‌కు చెందిన రెమిడీస్ హోప్ ఫౌండేషన్ వారి సహకారంతో ఉచిత ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వారు ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన 210 మంది రోగులను రెమిడీస్‌కు చెందిన ప్రముఖ వైద్యులు నటేష్ కుమార్ కొలుసు పరీక్షించి వైద్య సేవలు అందజేశారు. అలాగే మందులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా సాయి రమేష్, భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ తమ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో చేసే సామాజిక సేవల్లో ఇతర పరిశ్రమలకు ఆదర్శంగా నిలుస్తామన్నారు. తాము ఇప్పటికే డయాలసిస్, ఫిజియో థెరపీ సెంటర్లు ఏర్పాటు చేసి ఉచిత సేవలు అందిస్తున్నామన్నారు. అలాగే కంటి వైద్య శిబిరాలు నిర్వహించి శస్త్ర చికిత్సలు చేయడంతో కంటి అద్దాలు, మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే దత్తత గ్రామాల్లోని పాఠశాలలకు అన్ని సౌకర్యాలు సమకూర్చామన్నారు. విద్య, వైద్యంతో పాటు బస్ షెల్టర్లు, మినరల్ వాటర్ ప్లాంట్లు, టాయ్‌లెట్లు తదితర వాటిని నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ శిబిరంలో రెమిడీస్ సిబ్బంది సురేష్ కుమార్, శ్రీకాంత్, పవన్, విజయ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆటోలు ఢీ

ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన రామిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డి



తీవ్రంగా గాయపడిన రవి

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెల్ల గ్రామ సమీపంలో గురువారం రాత్రి రెండు ఆటోలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా.. మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తొండూరు మండలం గోటూరు గ్రామానికి చెందిన రామిరెడ్డి చంద్ర ఓబుళ రెడ్డి పులివెందుల పట్టణంలోని పాత బస్టాండు సమీపంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో టీవీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. రోజు మాదిరిగానే గోటూరు గ్రామం నుంచి పులివెందులకు మెకానిక్ పనిచేసుకుని తిరిగి సొంత గ్రామానికి ఆటోలో వెళుతుండగా.. నల్లచెరువుపల్లె నుంచి పులివెందుల వైపు వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో మెకానిక్ రామిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో రవి అనే మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇంటికి పెద్ద దిక్కు చనిపోవడంతో చంద్ర ఓబుళరెడ్డి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఆవరణంలో బోరున విలపించారు.

కుష్టు రహిత మండలంగా చాపాడు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు

చాపాడు : చాపాడు మండలాన్ని కుష్టు వ్యాధి రహిత మండలంగా ఉంచేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ, జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ రవిబాబు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ జనవరి 12 వరకు జరగనున్న జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో వైద్య సిబ్బంది సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. సర్వేలో ఎవరికైనా చర్మం పాలిపోయినా లేక రాగి వర్ణంలో పొడలు, మచ్చలు ఉన్నా, మచ్చలపై స్పర్శ లేకున్నా, చమట పట్టినా, వెంట్రుకలు పాక్షికంగా రాలిపోయినా, ముఖం నూనె రాసినట్లుగా నిగ నిగలాడిన, చర్మంపై మచ్చలుండి కాళ్లు, చేతులలో స్పర్శ లోపించినా కుష్టు వ్యాధి లక్షణాలుగా పరిగణించాలన్నారు. 6 నుంచి 12 నెలల వరకూ ఈ చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందన్నారు. వైద్యాధికారి రాజేష్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులను సైతం పరీక్షించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీవాణి, కావ్యమాధురి, సీహెచ్ఓ మహదేవయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి మాచనూరు రాఘవయ్య, సూపర్‌వైజర్ బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో న్యాక్ బృందం పర్యటన

మూడు రోజులపాటు వివిధ విభాగాల్లో పరిశీలన



ట్రిపుల్ ఐటీలో వివరాలను అడిగి తెలుసుకుంటున్న న్యాక్ బృంద అధికారులు

వేంపల్లె : నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్(న్యాక్) గుర్తింపు వస్తే అంతర్జాతీయ స్థాయిలో వివిధ కంపెనీలలో విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ ఆర్జీయూకేటీ చాన్సలర్ ప్రొఫెసర్ కె.చెంచురెడ్డి పేర్కొన్నారు. హర్యానా సోన్ పాట్ దీనబంధు చోటు రామ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వైస్ చాన్సలర్ డాక్టర్ రాజేంద్రకుమార్, చైర్‌పర్సన్ అనాయత్‌ల ఆధ్వర్యంలో 8మంది న్యాక్ బృందం ఆర్‌కేవ్యాలీ ట్రిపుల్ ఐటీని సందర్శించారు. మూడు రోజులపాటు ఆర్‌కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో అన్ని విభాగాలలోని తరగతి గదులు, వసతి గృహాలు, ప్రయోగశాలలో కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా మైదానం, ఎన్ఎస్ఎస్ విభాగాలు, లైబ్రరీ, ఒకేషనల్ విభాగాలు తదితర వాటిని సందర్శించనున్నారు. గురువారం సివిల్ విభాగానికి సంబంధించి ల్యాబ్‌లను పరిశీలించి అనంతరం తల్లిదండ్రులు, విద్యార్థులు, అధ్యాపకులతో వేర్వేరుగా సమావేశం ఏర్పాటు చేసి అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. క్యాంపస్‌లో ఉన్న సెంట్రల్ లైబ్రరీ, వివిధ విభాగాల కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం కూడా వివిధ విభాగాలలో పరిశీలించి ఉన్నతాధికారులకు న్యాక్ బృందం నివేదికలు పంపనున్నారని తెలిపారు. కార్యక్రమంలో వీసీ విజయ్‌కుమార్, డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, ఏఓ రాంభూపాల్‌రెడ్డి, అకడమిక్ డీన్ రత్నకుమారి, సివిల్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ అమరేంద్ర కుమార్ సండ్ర, అనిల్‌కుమార్‌రెడ్డి, పీఆర్ఓ తిరుపతిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి



సమీక్షలో పాల్గొన్న డీఎస్పీలు, సీఐలు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

- జిల్లాలో ఎలాంటి ఘటనలకు తావుండకూడదు
- రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లపై నిరంతరం నిఘా ఉంచాలి
- నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్ : రానున్న ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వర్తించాలని, ఎలాంటి ఘటనలు జరగడానికి వీల్లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం కడపలో జిల్లా పోలీస్ కార్యాలయంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లకు, ట్రబుల్ మాంగర్లకు, చెడు నడత కలవారికి క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. వారి కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ క్రిమినల్ కేసుల్లో నిందితులుగా ఉన్న రౌడీషీటర్లకు సాక్ష్యాధారాలతో శిక్షలు పడేలా చర్యలు వేగవంతం చేయాలన్నారు. తద్వారా వారి అక్రమ కార్యకలాపాలకు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేసేందుకు వీలవుతుందని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. జగనన్న సురక్ష ద్వారా పలు సర్టిఫికెట్లు సత్వరమే అందుతున్నాయి. నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

సొంతింటి కల సాకారమైంది



దినసరి కూలికి వెళితేనే మా జీవనం సాగుతుంది. కనీసం సెంటు స్థలం కూడా కొనలేని పరిస్థితి. అద్దె ఇంట్లో ఉన్నాము. గతంలో చాలా సార్లు ఇంటి స్థలం కోసం అర్జీలు పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన వచ్చిన తరువాత ఆఫీసుల చుట్టూ తిరగకుండానే నాకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరైంది. ఇప్పుడు నేను జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్నాను. జగన్ పుణ్యమా అని నాకు సొంత ఇంటి కల నెరవేరింది.

- మండ్ల హుసేనమ్మ, జగనన్న కాలనీ, సిద్దవటం

జగనన్న విద్యాదీవెన ఇచ్చాడు



జగనన్న విద్యాదీవెన కింద 2021 నుంచి ఏటా రూ.10వేలు వస్తోంది. పిల్లల చదువులతోపాటు మాకు ఇల్లు కూడా మంజూరు చేశారు. ప్రతి ఒక్కరి భవిష్యత్తు కోసం జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

- లింగాలదిన్నె సుమిత్ర, లింగాలదిన్నెపల్లె, బి.మఠం మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మా సొంతింటి కల సాకారమైంది. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగినా ఇల్లు మంజూరు కాలేదు. ప్రస్తుతం వలంటీర్లే మా ఇంటి వద్దకు వచ్చి ఇల్లు మంజూరు చేయించారు. ఇంటికి పూర్తిస్థాయిలో బిల్లులు అందాయి. జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు మంజూరు చేయడంతో సొంతింటి కల సాకారమైంది. ఎప్పటికి సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటాం.

- మొద్దుగాల్ల విజయ, ఎగువ లింగాల

పాత భవనం కూలి ఇద్దరు మృతి

మరో నలుగురికి గాయాలు





ప్రమాదంలో మృతి చెందిన కూలీలు

తిరుపతి క్రైమ్ : తిరుపతి నగరంలో పాత భవనం కూలుస్తుండగా ప్రమాదవశాత్తు ఒక్కసారిగా కూలిపోయి ఇద్దరు కూలీలు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వెస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని మంచాల వీధిలో నివాసం ఉంటున్న షబ్బీర్ అదే ప్రాంతంలో తన పాత ఇంటిని కూల్చేందుకు మోషన్ బాషా అనే వ్యక్తికి కాంట్రాక్ట్ ఇచ్చాడు. అతను ఆరుగురు కూలీలను తీసుకొచ్చి పాత భవనాన్ని కులుస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలింది. ఇందులో అనంతపురం జిల్లా కదిరికి చెందిన నారాయణ(40), వైఎస్సార్ జిల్లా పొద్దుటూరుకు చెందిన నరసింహులు(50) తీవ్రంగా గాయపడి మృతి చెందారు. అయితే ఇదే ప్రమాదంలో ఒక మహిళతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పాత భవనం కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా తడవడం వల్ల వీరు కూల్చే సమయంలో అదే కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాలను ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో బైక్ అదుపుతప్పి యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం ఉదయం కురబలకోట మండలంలో జరిగింది. మదనపల్లె చంద్రాకాలనీకి చెందిన శివరాజ్ కుమార్ (25) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో అంగళ్లుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మార్గమధ్యంలోని విశ్వం కాలేజీ వద్ద రోడ్డు మరమ్మతులు జరుగుతున్న ప్రదేశంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు.